బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 16 : దేవరకొండ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బానోవత్ రవికుమార్, బానోవత్ బాలాజీనాయక్‌తో పాటు మరికొందరున్నారు.

కార్యక్ర మంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషన్‌నాయక్, బీల్యానాయక్, రమేశ్‌నాయక్, గోవిందుయాదవ్, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతు చేపట్టాలి

● జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి

మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి

కట్టంగూర్, ఏప్రిల్16 : వేసవిలో కాలం గ్రామాల్లో తాగునీటి సమస్య నివారణకు చేతి పంపులను ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టాలని జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి సూచించారు. కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో మంగళవారం కట్టంగూర్, నకిరేకల్ మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో గ్రా మాల్లో పర్యటించాలన్నారు. తాగునీటి వృథా కాకుండా సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నీటి ఎద్దడి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్లను అద్దెకు తీసుకొవాలని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఉపాధిహామీ పనుల వద్ద వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీపీఓ మురళి, అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్, ఏపీడీ నర్సింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నర్సింహ, ఎంపీడీఓలు పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఏ.చంద్రశేఖర్, ఎంపీఓలు సన్ని అబ్రహం, మహ్మద్ అథర్ పర్వేజ్, ఏఈ జెల్లా నవీన్, ఏపీఓలు కడెం రాంమోహన్, రమణయ్య పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలి : డీఆర్డీఓ

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఓ నాగిరెడ్డి

తిప్పర్తి, ఏప్రిల్ 16: గ్రామాల్లో తాగు నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలని డీఆర్డీఓ నాగిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవాం తిప్పర్తి,మాడ్గుల పల్లి మండలాల ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో తాగు నీరు ఏర్పాటు చేయాలని, కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.అవసరమైన బోర్లు అద్దెకు తీసుకోవాలన్నారు . అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. స్కూల్ యూనిఫామ్‌లను కుట్టి అందించే విధంగా చర్యలు తీసుకొవాలన్నారు. సమావేశంలో డీపీఓ సీఈఓ బి. శ్రీనివాస రావు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు , ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఏపీఎం పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కరించాలి : ఎంపీడీఓ

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 16: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెడిపోయిన బోర్లకు, చేతిపంపులను బాగు చేయించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది నీటిని అందించాలని, ఒకవేళ ఎండిపోయితే వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ మోసిన్‌అలీన్, ఏపీవో సూరనాయక్, ఈసీ శంకర్, ఆర్‌డబ్లుఎస్ ఏఈ చిన్నినాయక్ పాల్గొన్నారు.

రాములోరి పెండ్లికి రారండోయ్

● నేడు శ్రీరామ నవమి ● వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

నల్లగొండ రామాలయంలో ఎదుర్కోళ్ల మహోత్సవం

రామగిరి, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమి వేడుకలకు అంతా సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. పలు కాలనీల్లోనూ సామూహికంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని షామియానాలు, చలువ పందిళ్లు వేయడంతో పాటు తాగునీరు, మజ్జిగను భక్తులకు అందుబాటులో ఉంచడంలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. నల్లగొండలోని రామాలయంలో మంగళవారం రాత్రి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పట్ట భద్రుల ఎన్నికలకు సిద్ధం ఉండాలి

● ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్ఓ హరిచందన
● వివిధ జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష

నల్లగొండ కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 16: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గం ఎన్నికల నిర్వహణకు సంబంధిత కలెక్టర్లు, జిల్లా ఎన్నికల యంత్రాంగాలు సిద్ధంగా ఉండాలని నల్లగొండ కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన కోరారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ నుంచి ఆమె వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది వివరాలను, అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌ల వివరాలను తక్షణమే సమర్పించాలని కోరారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల రూట్ మ్యాప్, ఇంటర్మీడియటరి డిస్ట్రిబ్యూషన్ ,రిసెప్షన్ కేంద్రాల వివరాలను సైతం సమర్పించాలని కోరారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలను ఆమె తెలియ జేస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల నిర్వహణకు అందరూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఆయా జిల్లాల నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలి

నల్లగొండ : లోక సభ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు నియమించిన సిబ్బంది అందరూ జాగ్రత్తగా విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబర్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు నియమించిన అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పాటించే ప్రక్రియలను ఒక్కో సిబ్బందితో వారు చేయాల్సిన విధులపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆమె లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పా టు చేసిన జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్, ఎన్నికల అనుమతులను ఇచ్చే సువిధ వి గం, ఎన్నికల వ్యయ నిర్వహణకు ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ విభాగాలను తనిఖీ చేసి ఆయా టీముల పని తీరును పరిశీలించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్ఓ రాజ్యలక్ష్మి ఈ సమావేశానికి హాజరయ్యారు.

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు: మాడ్గులపల్లి ఎంపీపీ శ్రీవిద్యారాజు

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీ విద్య

మాడ్గులపల్లి, ఏప్రిల్ 16: బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, చివరి వరకు తాను పార్టీలోనే కొనసాగుతానని ఎంపీపీ పోకల శ్రీవిద్య రాజు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొందరు మండలంలో తాను బీఆర్ఎస్ పార్టీ మారుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను 2012లో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి తెలంగాణ ఉద్యమంలో, పార్టీలో నిజాయితీగా, నిబద్ధతతో పని చేస్తున్నానని అన్నా రు. వార్డు సభ్యులుగా గెలిచి ఉప సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీగా గెలిచానని నమ్ముకున్న పార్టీని ద్రోహం చేసే వ్యక్తిత్వం తనది కాదన్నారు. సీసీ రోడ్ల విషయంలో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోని తమపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకుడు రాజు ఉన్నారు.

సన్నాహక సమావేశానికి తరలిన నాయకులు

జెండా ఊపి ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్‌రెడ్డి

గుర్రంపోడ్, ఏప్రిల్ 16 : హలియాలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ఆ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.వారికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తరలిన వారిలో బీఆర్ఎస్ నాయకులు వజ్జ ధనంజయ్,బచ్చనబోయిన శ్రీనివాస్, కుప్ప పృథ్వీ రాజ్, కునూరు సైదిరెడ్డి, మేకల వెంకట్‌రెడ్డి, మల్లోజు శ్రీనివాసాచారి, మేకల నాగిరెడ్డి, మల్లోజు నాగార్జునచారి, ఎలుకొండ నగేశ్ , తేలుకుంట్ల కుర్మాల్‌రెడ్డి, వేముల యాదయ్య, వనమాల మహేందర్, ముద్దు నిశాంత్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

లావూడి తండాలో రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న సీఎస్ డీటీ జావీద్

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 16: మండలంలోని లావూడితండా రేషన్ దుకాణం సివిల్ సప్లయ్ డీటీ జావీద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో బియ్యం నిల్వలను పరిశీలించారు. ఉండాల్సిన దానికి కంటే అదనంగా 12.01 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దాంతో డీలర్ చిలువేరు వినోద్‌పై 6(ఏ) కేసు నమోదు చెప్పారు. ప్రస్తుతం దుకాణంలో ఉన్న నిల్వలను చిల్లాపురం రేషన్ డీలర్‌కు అప్పజెప్పినట్లు తెలిపారు. కాగా లావూడి తండాలో లావూరి శంకర్ అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్ సోమవారం దాడిచేసి 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మెదుగు శ్రీకాంత్ వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ నరేందర్ వాహనంలో 60 బస్తాల్లో 30 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ నరేశ్ తెలిపారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేసి బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేసవిలో విద్యుత్ ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి

● ఎస్ఈ చంద్రమోహన్

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 16 : వేసవి విద్యుత్ ఉద్యోగులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్ సూచించారు. హైదరాబాద్ యశోధ దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ ఉద్యోగులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 225 మంది ఉద్యోగులకు పలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ నవీద్ అహ్మద్,1104 యూనియన్ నాయకులు వెంకటయ్య, 327 యూనియన్ కార్యదర్శి సురేశ్ కుమార్, డాక్టర్లు ఉన్నారు. =

ఊరంతా ఒక్కటై అనాథకు అంత్యక్రియలు

● మానవత్వం చాటుకున్న పేరూరు గ్రామస్తులు

మోహన్‌రావు అంత్యక్రియల్లో పాల్గొన్న గ్రామస్తులు

హాలియా, ఏప్రిల్ 16 : ఎంతకాలం బతికినాం, ఎంత సంపాదించినాం అన్నది ముఖ్యం కాదు. చనిపోయాక కూడా అందరి హృదయాల్లో ఎంతకాలం జీవిస్తామన్నదే ముఖ్యం.కరెన్సీ మోజులో మానవత్వం మరుస్తున్న ఈ రోజుల్లో అనాథ వ్యక్తికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు అనుముల మండల పేరూరు గ్రామస్తులు. మోహన్‌రావు అనే వ్యక్తి బతుకుదెరువు కోసం 30 ఏళ్ల క్రితం గ్రామానికి అనాథగా వచ్చాడు. అప్పటి నుంచి ఆస్తి పాస్తులు ఏమి కూడ బెట్టుకోలేదు. బ్యాంకు బ్యాలెన్స్ లేవు. కానీ గ్రామంలో 30 ఏళ్లుగా అందరి నోట్లో నాలుకయ్యాడు. ఆకలి అయితే అన్నం పెట్టమని కోరేవాడు. డబ్బులు అవసరమైన ఇంటింటికీ వెళ్లి అడుక్కునే వాడు. గ్రామంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరిస్తూ, గ్రామస్తులకు తన ప్రేమాభిమానాలు పంచాడు. ఈ క్రమంలో మంగళవారం మోహన్ రావు మృతి చెందాడు. ఆయన మరణవార్త తెలుసుకున్న గ్రామస్తులు కడసారి ఆయన మృతదేహాన్ని చూసేందుకు చిన్న, పెద్ద తేడా లేకుండా కదిలి వచ్చారు. ఊరంతా ఏకమై ప్రతి ఒక్కరూ శక్తి కొలది డబ్బులు పొగేసి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. మోహన్‌రావుకు అంత్యక్రియలు నిర్వహించిన తీరు మనుష్యుల్లో మానవత్వం ఉందని మరోసారి రుజువైనది.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెర్కు లింగం గౌడ్

మర్రిగూడ, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెర్కు లింగం గౌడ్ కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.100 రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు వచ్చినప్పటికీ రైతులకు ఇప్పటివరకు రైతు బంధు సాయం, రుణమాఫీ నిధులను విడుదల చేయలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలిస్తేనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి హక్కులను సాధించుకోగల్గుతామన్నారు.

రేవంత్‌రెడ్డి.. అహంకారం తగ్గించుకో

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్

నకిరేకల్, ఏప్రిల్ 16 : సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ భిక్షం పెట్టింది మాదిగలే నని..నిజం కాదని చెప్పే దమ్ముందా రేవంత్ రెడ్డి..ఇప్పటికైనా అహంకారాన్ని తగ్గించుకోవాలని, లేకుంటే కాంగ్రెస్ పార్టీని మాదిగలే బొంద పెడతారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నకిరేకల్ పట్టణంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకు సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయభిక్ష పెట్టింది మాదిగలేనని స్వయంగా ఆయనే పలు వేదికలపై చెప్పి, ఇప్పుడు ఎమ్మార్పీఎస్ ఉద్యమంపై, మందకృష్ణ మాదిగపై విమర్శిస్తున్నాడన్నారు. మాదిగలను మోసం చేసినందుకు ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని, రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి వం గూరి ప్రసాద్, నాయకులు మాచర్ల వెంకట్, జిల్లా ప్రశాంత్, వంగూరి నరేశ్, మాచర్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ డబ్బులు వాడుకున్న వారిపై చర్యలు తీసుకోవాల వినతి

త్రిపురారం : గ్రామపంచాయతీ డబ్బులు వాడుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని జి.అన్నారం మాజీ ఉప సర్పంచ్ చిత్రం నరేశ్ మంగళవారం డీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న చింతలచెర్వులోని నల్లరేగడి మట్టిని గ్రామ పెద్దలు, ఊరికి సంబంధించిన ప్రజల సమక్షంలో వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన మజ్జిగపు జుంకారెడ్డికి రెండు విడుతలుగా రూ.13.50లక్షలకు విక్రయించడాన్ని అట్టి డబ్బును కేవలం గ్రామపంచాయతీ అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని ముందే తీర్మానించుకున్నట్లు తెలిపా రు. కానీ ఇప్పుడు గ్రామ మాజీ సర్పంచ్ సుభాశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి ఆ డబ్బును సొంతంగా వాడుకుంటున్నారని పేర్కొన్నారు.ఇందుకు సహకరించిన కార్యదర్శి బిచ్చునాయక్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 16 : దేవరకొండ మండలంలోని మైనంపల్లి వాగు నుంచి కొండమల్లేపల్లికి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను దేవరకొండ రోడ్డులో పట్టుకుని ట్రాక్టర్ సీజ్ చేశారు. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ట్రాక్టర్ యాజమాని రమావత్ లాలునాయక్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

కోదండ రామాలయంలో ఎమ్మెల్యే బాలూనాయక్ పూజలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలూనాయక్

డిండి, ఏప్రిల్ 16: మండలంలోని గోనబోయినపల్లి వేలాద్రి కోదండ సీతారామలక్ష్మణ సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయక మిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కిన్నెర హరికృష్ణ, బద్దెల శ్రీనివాస్‌యాదవ్, పాపయ్య, మల్లయ్య, బాలకృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లే కుండా ధాన్యం కొనుగోళ్లు

● జిల్లా సివిల్ సప్లయ్ అధికారి నాగేశ్వర్ రావు

మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

మర్రిగూడ,ఏప్రిల్ 16 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి నాగేశ్వర్ రావు,చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం అన్నారు.మంగళవారం మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. మ్యాచర్ అయిన వెంటనే ధాన్యాన్ని తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గన్నీ బ్యా గుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తాలూ, తేమశాతం లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలస్యం లేకుండా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. టోకెన్ నంబర్ ఆధారంగా కొనుగోళ్లు జరపాలని దళారీ వ్యవస్థనుప్రోత్సహించొద్దని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పారదర్శకంగా ఉండాలి

నల్లగొండ సిటీ : ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని కనగల్ తాసీల్దార్ పద్మ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. శాబ్దులాపురం, రేగట్టె, తిమ్మనగూడెం, ఎస్. లింగోటం, తేలకంటిగూడెం, దర్వేశిపురం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్యాబ్‌లో నమోదు చేయాలని ఎగుమతి దిగుమతిలో హమాలీల సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట సందా రామలింగయ్య, ఏపీఎం హరి,ఆర్ఐ ప్రసాద్, సీసీలు నర్సింహ,విజయకుమారి,ప్రభాకర్ ఉన్నారు.

తరుగు దందాపై కదిలిన యంత్రాంగం

● నమస్తే తెలంగాణ కథనానికి స్పందన
● కలెక్టర్ ఆదేశంతో చీమలగడ్డ ధాన్యం కొనుగోలు కేంద్రంలో విచారణ

చీమలగడ్డలో విచారణ చేపడుతున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీసీఓ కిరణ్‌కుమార్

నకిరేకల్, ఏప్రిల్ 16 : నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'కొనుగోలు కేంద్రాల్లో తరుగు దందా' కథనానికి కలెక్టర్ హరిచందన స్పందించారు. అక్రమాలపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దాంతో నకిరేకల్ మండల కేంద్రంలోని చీమలగడ్డ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీసీఓ కిరణ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సెంటర్‌లో తరుగు, లోడింగ్ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సెంటర్ నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్కువ కాంటా వేస్తున్నారని పత్రికకు చెప్పిన రైతు నాగయ్య హాస్పిటల్‌లో ఉన్నాడని, అతని కొడుకును అడిగి 42 కిలోల తరుగుపై వివరాలు తెలుసుకున్నామని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం 40కిలోలు, గన్నీ బ్యాగు 650 గ్రాములు.. మొత్తం 40కిలోల 650 గ్రాములు మాత్రమే తూకం వేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో లక్ష టన్నుల లక్ష్యాన్ని దాటామని, ఇప్పటికే రైతుల అకౌంట్లలో రూ.80 కోట్లు జమ చేశామనిచెప్పారు. ధాన్యం కొనుగోలు వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్ష చేస్తున్నారన్నారు. జిల్లా స్థాయిలో ఒక ప్రొక్యూర్‌మెంట్ కమిటీ ఉన్నదని, అందులో డీఎస్ఓ, సివిల్ సప్లయ్ డీఎం, డీఆర్‌డీఏ పీడీ, డీసీఓ, వ్యవసాయ అధికారులు ఉన్నారని, వారు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. వారి వెంట తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, డీటీసీఎస్ జ్యోతి, ఆర్ఐ రాంప్రసాద్, పీఏసీఎస్ సీఈఓ జగన్మోహన్‌రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జీలు నాగరాజు, సైదులు ఉన్నారు.

పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌లో ఉచిత శిక్షణ

● ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి వ్యవస్థాపనక అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 16 : ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్, 9వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ తరగతులను ఈనెల 19 నుంచి మే 23, 2024వరకు ఉచితంగా ఇస్తున్నట్లు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్.సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నల్లగొండలోని ఓ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నల్లగొండలోని వీటీకాలనీ సెంటర్ సమీపంలోని కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రతి ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆయా సబ్జెక్టుల్లో అత్యంత అనుభవంగల అధ్యాపకులు, ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వనున్నట్లు